అల్ఫోర్స్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

సంప్రదాయ వేషధారణలో ఉన్న విద్యార్థులతో అల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి

జగిత్యాల, జనవరి 9: పట్టణంలోని కృష్ణానగర్‌లో గల అల్ఫోర్స్ పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించగా, విద్యా సంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ పల్లె శోభను తలపిస్తుందని, ఈ పండుగ ద్వారా సకల శుభాలు జరుగుతాయన్నారు. ఈ పండుగకు భారతదేశంలో చాలా విశిష్టత ఉందన్నారు. అలాగే, అల్ఫోర్స్ మ్యాథ్స్ ఒలింపియాడ్ టెస్ట్ జగిత్యాల విభాగం టాపర్లకు బహుమతులు ప్రదానం చేసి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి

కోరుట్ల/కథలాపూర్, జనవరి 9: అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సుహాసిని పేర్కొన్నారు. కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలతో పాటు కథలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఆమె అధ్యాపకులను విరామ సమయాల్లో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటుతో మద్దతు తెలుపాలని విజ్ఞప్తి చేశారు. ఆయా చోట్ల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సుహాసిని మాట్లాడుతూ, సీపీఎస్ రద్దుకు అసెంబ్లీ వేదికగా పోరాటం చేస్తానన్నారు. ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసు రూల్స్ సాధన, పదోన్నతుల ప్రక్రియ క్యాలెండర్ రూపకల్పనకు కృషి చేస్తానని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ అభివృద్ధికి ఏడు శాతం నిధులు కూడా కేటాయించడం లేదన్నారు. విద్యారంగ సమస్యలపై శాసన మండలిలో గళం విప్పి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్

విద్యార్థులతో జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, సిబ్బంది

జగిత్యాల, జనవరి 9: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ డ్రైవింగ్ చేయాలని జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ సూచించారు. జిల్లా కేంద్రంలోని సూర్య గ్లోబల్ పాఠశాలలో గురువారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ, హెల్మెట్ ధరించకపోవడం, సీటు బెల్టు పెట్టుకోకపోవడం, తాగి వాహనం నడపడం వల్ల జరిగే ప్రమాదాలను వివరించారు. ప్రమాదాల్లో పెద్ద దిక్కును కోల్పోతే కుటుంబం మొత్తం రోడ్డున పడుతుందన్నారు. వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దన్నారు. ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశం మాట్లాడుతూ, హెల్మెట్ ధరించిన వాహనదారులకు పూలు అందించి అభినందించారు. పాఠశాల వాహనాల డ్రైవర్లకు హెల్మెట్లను బహుమతిగా అందించారు. పాఠశాలలో ట్రాఫిక్ గురించి చిత్రాలను ప్రదర్శించిన చిన్నారులను, అధ్యాపక బృందాన్ని డీటీవో శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశం అభినందించారు. ఈ కార్యక్రమంలో కర స్పాండెంట్ శ్రీధర్ రావు, డైరెక్టర్లు హరిచరణ్ రావు, మౌనికరావు, రజిత, ఎంవీఐలు రామారావు, ప్రమీల, అభిలాష్, రియాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనికరం లేని కొడుకులు

- తండ్రిని ఇంట్లోంచి గెంటివేత
- ఆశ్రయమిచ్చిన సీనియర్ సిటిజన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్

జగిత్యాల జనవరి 9: జగిత్యాలకు చెందిన కాంజెట్టి చంద్రయ్య (80)కు ఇద్దరు కొడుకులు ఉన్నారు. కాగా, బుధవారం రాత్రి ఆయనను ఇంట్లోంచి గెంటివేయడంతో సీనియర్ సిటిజన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్‌ను ఆశ్రయించారు. తమ కోడళ్ల ప్రోద్బలంతో తనను ఇంట్లోంచి గెంటివేశారని రోదిస్తూ చెప్పాడు. చంద్రయ్యకు బుధవారం రాత్రి తన ఇంట్లో ఆశ్రయమిచ్చి, భోజన, వసతి సౌకర్యాలు హరి అశోక్ కుమార్ కల్పించారు. గురువారం ఉదయమే చంద్రయ్య కుటుంబసభ్యుల వద్దకు సంఘ ప్రతినిధులతో కలిసి హరి అశోక్ కుమార్ వెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చారు. వయోవృద్ధుల సంక్షేమ, సంరక్షణ చట్టంపై అవగాహన కల్పించారు. నిరాదరిస్తే 6 నెలల వరకు జైలు శిక్ష, జరిమానా విధిస్తారని, ఇది వరకు విధించిన కేసుల వివరాలను వారికి వివరించారు. కౌన్సిలింగ్‌తో కొడుకులు, కోడళ్లు స్పందించారు. చంద్రయ్యకు క్షమాపణ చెప్పి తమ ఇంట్లోకి ఆహ్వానించారు. పోషణ, బాగోగులు చూసుకుంటామని కొడుకులు, కోడళ్లు సమ్మతి పత్రం రాసిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, కోశాధికారి ప్రకాశ్, ఉపాధ్యక్షులు పీసీ హన్మంత రెడ్డి, ఎండీ యాకూబ్, బొబ్బటి కరుణ, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

జగిత్యాలరూరల్: తిరుపతి కుటుంబసభ్యులకు నగదు అందజేస్తున్న అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి, కార్యదర్శులు

జగిత్యాల రూరల్, జనవరి 9: గొల్లపల్లి మండలం బీబీరాజ్ గ్రామ పంచాయతీ కార్యదర్శి రాసమల్ల తిరుపతి అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి స్వగ్రామం లక్ష్మీపూర్ గ్రామంలో గురువారం బాధిత కుటుంబాన్ని అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి మధుసూదన్, కార్యదర్శుల సంఘం నాయకులు పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల సంఘం తరపున తమవంతుగా బాధిత కుటుంబానికి రూ. లక్ష అదనపు కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమాదేవి, ఎంపీవోలు సురేశ్ రెడ్డి, రవిబాబు, పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్, జనవరి 9: బీర్‌పూర్ మండలం కండ్లపెల్లి గ్రామానికి చెందిన భజన బృందం సభ్యుడు తిర్రి రాజన్న ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబానికి గురువారం విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ సభ్యులు రూ. 9 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు కొద్దిపర్తి మధుకుమార్, నాయకులు ఆడెపు నర్సయ్య, ఓగుల అజయ్, బండారి రవి, గర్షకుర్తి రమేశ్, భీమన్న, కోట కిషన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొండాపూర్‌లో మక్క పంట పరిశీలన

మేడిపల్లి, జనవరి 9: మేడిపల్లి మండలం కొండాపూర్‌లో చందా రమేశ్‌కు చెందిన మక్క చేనును గురువారం ఏఓ షాహిద్ అలీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో మక్క పంటకు కత్తెర పురుగు ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

కొడిమ్యాల, జనవరి 9: తనను అకారణంగా చితకబాదిన ఎస్ఐ సందీప్‌పై చర్యలు తీసుకోవాలని మండల కేంద్రానికి చెందిన రాచకొండ రాజేందర్ గురువారం హైదరాబాద్‌లో మానవ హక్కుల సంఘం కమిషనర్ శ్రీనివాస్‌రావుకు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా బాధితుడు రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 4న కొడిమ్యాల బస్టాండ్ నుంచి అంగడి బజార్ వైపు తన బైక్‌పై వెళ్తుండగా.. వాహనాల తనిఖీ చేస్తున్న ఎస్ఐని పట్టించుకోలేదని ఆగ్రహించాడు. వాహనం ఆపకుండా ఎందుకొచ్చావంటూ కానిస్టేబుల్ రాకేశ్‌తో కలిసి ఎస్ఐ చితకబాదగా, తీవ్ర గాయాలు అయ్యాయని వాపోయాడు. ఈ విషయమై ఈ నెల 6న ఎస్పీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు బాధితుడు రాజేందర్ తెలిపారు.

కరపత్రం ఆవిష్కరణ

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల, జనవరి 9: జిల్లా కేంద్రంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జగిత్యాల ఆధ్వర్యంలో హెచ్ఎంపీవీ వైరస్ వ్యాప్తిపై ముద్రించిన 'భయం వీడుదాం–జాగ్రత్తలు పాటిద్దాం' అవగాహన కరపత్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు హెచ్ఎంపీవీ వైరస్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కరపత్రం రూపొందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ హేమంత్, ప్రధాన కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి డాక్టర్ సుధీర్, డాక్టర్ రజిత, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ డంపు సీజ్

మెట్‌పల్లి రూరల్, జనవరి 9: మండలంలోని ఆత్మనగర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపును సీజ్ చేసినట్లు ఆర్ఐ ఉమేశ్ పేర్కొన్నారు. అక్రమంగా ఇసుక నిల్వ ఉంచారన్న సమాచారం మేరకు గురువారం తనిఖీ చేపట్టగా, సుమారు 50 ట్రాక్టర్ ట్రిప్పుల సామర్థ్యం గల డంపును గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేసే వారిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ముగ్గుల పోటీలు

గొల్లపల్లి, జనవరి 9: గొల్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వరందన్, ఎస్ఐ సతీశ్, నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సంస్థ మండలాధ్యక్షుడు సాయిని నరహరి, ఉపాధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి చొప్పదండి చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాయికల్, జనవరి 9: రాయికల్ మండల పరిషత్ కార్యాలయంలో ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీ, ఐకేపీ, మహిళా పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు, మహిళా సంఘాల సభ్యులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఖయ్యూం, ఎంపీవో సుష్మా, నాయబ్ తహసీల్దార్ గణేశ్, ఏఈ ప్రసాద్, ఏపీఎం చక్రవర్తి, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

హోటళ్లలో తనిఖీలు

జగిత్యాల టౌన్, జనవరి 9: జిల్లా కేంద్రంలోని హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లను మున్సిపల్ అధికారులు తనిఖీ చేశారు. నాణ్యత పాటించని హోటళ్లకు రూ.10వేల జరిమానా విధించినట్లు మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాము, ఎన్‌వీరాన్‌మెంట్ ఇంజినీర్ శ్రీకాంత్ తెలిపారు. హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు శుభ్రతతో పాటు నాణ్యమైన సరుకులు వాడాలని సూచించారు. తనిఖీలో వార్డ్ ఆఫీసర్స్, జవాన్లు ఉన్నారు.

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

మేడిపల్లి, జనవరి 9: పదో తరగతి వార్షిక ఫరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాధికారి రాము సూచించారు. కొండాపూర్, గోవిందారం జడ్పీ ఉన్నత పాఠశాలలను గురువారం ఆయన పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కంప్యూటర్ ల్యాబ్ కోసం రూ.15 వేలు అందించిన హిందీ ఉపాధ్యాయురాలు సదాలక్ష్మిని సన్మానించారు. ఇక్కడ జిల్లా సెక్టోరియల్ అధికారి చిప్ప సత్యనారాయణ, హెచ్ఎంలు సత్తర్ ఖలీద్, అశ్పక్ హుస్సేన్, ఉపాధ్యాయులు సుధాకర్, మల్లాల్‌రావు, మనోహర్, రాజేందర్‌రెడ్డి, చంద్రప్రకాశ్ రెడ్డి, రాజేందర్, నరేశ్, నర్సయ్య, పవన్, నవ్య, తదితరులున్నారు.

ఉపాధ్యాయురాలు సదాలక్ష్మిని సన్మానిస్తున్న డీఈవో రాము

క్యాలెండర్ ఆవిష్కరణ

ఉపాధ్యాయులతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈవో

మల్లాపూర్, జనవరి 9: మండలంలోని రేగుంట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల సహకారంతో రూపొందించిన నూతన సంవత్సర స్టూడెంట్ క్యాలెండర్‌ను గురువారం మండల విద్యాధికారి దామోదర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు మంచి లక్ష్యాన్ని ఎంచుకొని, సాధించే వరకు శ్రమించాలని సూచించారు. విద్యార్థుల ఫొటోలతో కూడిన క్యాలెండర్‌ను రూపొందించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శంకర్‌బాబు, ఉపాధ్యాయులు నర్సింగరావు, అనిల్, రాజరత్నం, గోవర్ధన్, లలిత, రజినీ పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీలు అందజేత

మల్లాపూర్, జనవరి 9: గుండంపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం కోరుట్ల పట్టణానికి చెందిన శ్రీ బాలాజీ బుక్ సెల్లర్ నిర్వాహకుడు స్వామి, మిత్రబృందం సభ్యులు కలిసి రూ. లక్ష విలువైన బెంచీలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం చంద్రప్రకాశ్ మాట్లాడుతూ, విద్యార్థుల సమస్యను తెలుసుకొని బెంచీలను అందజేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ స్నేహిత, ఉపాధ్యాయులు, అంజయ్య, మధు, ఫహీమా, గీత, సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి బాలుడి మృతి

మల్లాపూర్, జనవరి 9: మండలంలోని గొర్రెపల్లి గ్రామానికి చెందిన నేదునూరి కార్తీక్ (14) ప్రమాదవశాత్తు ఓ వ్యవసాయ బావిలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ రాజు గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కార్తీక్ బుధవారం సాయంత్రం సమయంలో గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావి వద్దకు చేపలు పట్టడానికి వెళ్లాడు. కాగా, చేపలు పడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడడంతో నీట మునిగి మృతి చెందాడు. కార్తీక్ తండ్రి రాజం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నేడు ధర్మపురిలో ట్రాఫిక్ ఆంక్షలు

ధర్మపురి, జనవరి 9: ధర్మపురిలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు సీఐ రాంనర్సింహారెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం 5 గంటల నుంచి శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు బ్రాహ్మణ సంఘ భవనం, ఇసుక స్తంభం, నంది చౌరస్తా, వైశ్య సత్రం నుంచి ఆలయం వరకు వాహనాల రాకపోకలకు అనుమతి లేదని పేర్కొన్నారు. వాహనాల్లో వచ్చిన భక్తులు వారివారి వాహనాలను నంది చౌరస్తా, హరిత హోటల్ సమీపంలో లేదా కూరగాయల మార్కెట్‌లో, గోదావరి ఒడ్డున మంగళిగడ్డ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాల్లోనే నిలుపుకోవలన్నారు. సూచించిన స్థలంలోనే వాహనాలను నిలిపి దర్శనానికి వెళ్లాలని సూచించారు..

గర్భిణులకు వైద్య పరీక్షలు

సారంగాపూర్, జనవరి 9: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో గురువారం పీఎంఎస్ఎంఏ ప్రోగ్రామ్‌లో భాగంగా గర్భిణులకు వైద్య, రక్తపరీక్షలు నిర్వహించారు. గర్భిణులు ప్రతి రోజూ ఐరన్ మాత్రలు వేసుకోవాలని మండల వైద్యాధికారి రాధ సూచించారు. ప్రభుత్వ దవాఖానలో డెలివరీకి అన్ని వసతులు ఉన్నాయని, చిన్న పిల్లల వైద్యులు కూడా అందుబాటులో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బతికపల్లిలో పశువైద్య శిబిరం

పెగడపల్లి, జనవరి 9: పెగడపల్లి మండలం బతికపల్లి గ్రామంలో గురువారం మండల పశువైద్యశాఖ ఆధ్వర్యంలో మెగా పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మనోహర్, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ నరేశ్ ప్రారంభించారు. ఇందులో 184 పశువులకు వివిధ పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పశువైద్యాధికారి మనోహర్ మాట్లాడుతూ, అధిక పాల దిగుబడికి పాడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా పశుగణాంక అధికారి డాక్టర్ ఎస్పీ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, మండల పశువైద్యాధికారులు లింగాల హేమలత, కిరణ్‌రెడ్డి, కమలాకర్, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్, రాజ్‌కుమార్, వేణుగోపాల్, రాకేశ్, సిబ్బంది మతిన్, సంతోష్, షాదుల్లా, నర్సయ్య, జానీపాషా, శంకరయ్య, అంజయ్య, శ్రీకాంత్, తిరుపతి, పాడి రైతులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

కథలాపూర్, జనవరి 9: కథలాపూర్ మోడల్ స్కూల్‌లో త్రినేత్రి ఐ కేర్ దవాఖాన ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. పలువురు విద్యార్థులకు కంటి చూపు మందగించినట్లు గుర్తించి, వారికి కళ్లద్దాలు అవసరమని సూచించారు. విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. ఉచితంగా వైద్యసేవలందించిన నేత్ర వైద్యుడిని ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నేత్ర వైద్యుడు మైస శ్రీధర్, ప్రిన్సిపాల్ అనిత, ఉపాధ్యాయులు రాజు జాదవ్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

మల్యాలలో మహిళ పై కోతుల దాడి

మల్యాల, జనవరి 9: మండల కేంద్రంలో గురువారం కొంజర్ల అమృతమ్మ ఇంట్లోకి సుమారు 20 నుంచి 30 కోతులు దూరి సామగ్రిని చిందరవందరగా పడేశాయి. కోతులను ఇంట్లోంచి బయటకు పంపించేందుకు అమృతమ్మ ప్రయత్నం చేయగా, ఆమెపై దాడిచేయడంతో గాయాలయ్యాయి. దీంతో ఆమెను కుటుంబ సభ్యులు మల్యాల పీహెచ్‌సీకి తీసుకురాగా చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం జగిత్యాల ఏరియా దవాఖానకు తరలించారు. కాగా, ఇటీవల పలు గ్రామాల్లో కోతుల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కోతుల నివారణకు ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టాలని పలువురు వేడుకుంటున్నారు.

పారిశుధ్య కార్మికుడి అంత్యక్రియలకు ఆర్థిక సాయం

మెట్‌పల్లి, జనవరి 9: మెట్‌పల్లి మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు మారంపల్లి రాజం గురువారం మృతి చెందగా, దహన సంస్కారాల కోసం మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేన సుజాత రూ. 10 వేలు అందజేశారు. అంతకు ముందు రాజం భౌతికకాయన్ని సందర్శించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇక్కడ బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బోయినపల్లి చంద్రశేఖర్‌రావు, కౌన్సిలర్ మధులత, బీఆర్ఎస్ నాయకులు బర్ల రమేశ్, శానిటరీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ముజీబ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉస్మాన్, మున్సిపల్ కార్మికులు తదితరులున్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

నోడల్ అధికారి నారాయణను సన్మానిస్తున్న అధ్యాపకులు

మల్లాపూర్, జనవరి 9: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి నారాయణ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ఆయన సందర్శించారు. కళాశాలలో రికార్డులు, పరిసర ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి మాట్లాడుతూ, విద్యార్థులకు ఇంటర్ విద్య కీలకమని, వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం ఆయనను అధ్యాపకులు శాలువాతో సన్మానించారు. ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు, విద్యార్థుల ఔదార్యం

మల్లాపూర్, జనవరి 9: మండల కేంద్రానికి చెందిన రామ నర్సయ్య, మానాల అశోక్ ఇటీవల వేర్వేరు కారణాలతో మృతి చెందారు. కాగా, వారి పిల్లలు స్థానిక ఆదర్శ పాఠశాలలో చదువుతున్నారు. దీంతో తమ వంతుగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ. 24 వేలు సేకరించారు. ఇరు కుటుంబాలకు గురువారం ప్రిన్సిపాల్ భూమేశ్ నగదు అందజేశారు. ఇక్కడ ఉపాధ్యాయులు శ్రీకాంత్, వెంకటేశ్, మదన్‌మోహన్, షబ్బీర్, విద్యార్థులు ఉన్నారు.

12న అనియత విద్యాబోధకుల సమావేశం

మెట్‌పల్లి, జనవరి 9: పట్టణంలోని కోదండ రామాలయం ఫంక్షన్ హాల్‌లో ఈనెల 12న ఉదయం 11 గంటలకు మెట్‌పల్లి ప్రాజెక్ట్ పరిధిలోని అనియత విద్యా బోధకులు, సూపర్‌వైజర్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు అనియత విద్యా బోధకులు, సూపర్‌వైజర్ల సంఘం మెట్‌పల్లి ప్రాజెక్ట్ అధ్యక్షుడు దురిశెట్టి రాజేశం తెలిపారు. పట్టణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సమావేశానికి ప్రాజెక్ట్ పరిధిలోని మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి, రాయికల్ మండలాలకు చెందిన బోధకులు, సూపర్‌వైజర్లు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎస్ఐకి ఫోన్ అప్పగించిన విద్యార్థులు

కొడిమ్యాల, జనవరి 9: మండల కేంద్రానికి చెందిన ఇండో టెక్నో స్కూల్ విద్యార్థులు గ్లాడ్సన్, సమీకి స్థానిక బస్టాండ్ ప్రాంతంలో స్మార్ట్ ఫోన్ దొరికింది. విద్యార్థులు ఫోన్ తీసుకెళ్లి ఎస్ఐ సందీప్‌కు అప్పగించారు. విద్యార్థులను ఎస్ఐ అభినందించారు. ఫోన్ పోయిన వారు స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థికి అభినందన

గొల్లపల్లి, జనవరి 9: గొల్లపల్లి మోడల్ స్కూల్ పదో తరగతి విద్యార్థి వర్షిణి బయోలాజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ప్రతిభా పోటీల్లో రెండో ర్యాంక్ సాధించింది. కలెక్టరేట్‌లో గురువారం వర్షిణిని కలెక్టర్ సత్యప్రసాద్ అభినందించారు. కష్టపడి చదివి పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో రామునాయక్, ప్రిన్సిపాల్ సుంకరి రవి, తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశి వేడుకలకు ఆలయం ముస్తాబు

ధర్మపురి, జనవరి 9: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయం శుక్రవారం ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా నిర్వహించే వేడుకలకు ముస్తాబైంది. ఆలయ గోపురాలను విద్యుద్దీపాలతో, వివిధ రకాల పూలతో పుష్ప వేదికను అలంకరించారు. ఈ వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ కోరారు.

నీటి సంపులో పడి ఒకరి మృతి

కోరుట్ల, జనవరి 9: పట్టణ శివారు మాదాపూర్ రోడ్డులో గల శివ రామ్మకృష్ణ రైస్ మిల్లులో పని చేస్తున్న సజ్జన్ చౌదరి(38) ప్రమాదశాత్తు నీటి సంపులో పడి మృతి చెండాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రంలోని తగారియా జిల్లా సిస్బా గ్రామానికి చెందిన సజ్జన్ చౌదరి ఏడాదిగా స్థానిక రైస్‌మిల్లులో హమాలీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి నీటి సంపు గోడపై కుర్చొని భోజనం చేస్తుండగా, ప్రమాదశాత్తు అందులో పడి మృతి చెందాడు. సజ్జన్‌చౌదరి అన్న రాజ్‌కుమార్ చౌదరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, సజ్జన్ చౌదరికి భార్య, ఐదుగురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

37 లక్షల మొక్కల పెంపకమే లక్ష్యం

వెంగళాయిపేటలో వన నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్డీవో రఘువరణ్

పెగడపల్లి, జనవరి 9: వనమహోత్సవం